నిరుపయోగంగా క్రీడా ప్రాంగణాలు



మెట్‌పల్లి: 'ఇది మెట్‌పల్లి పట్టణంలోని మండల పరిషత్‌కు చెందిన స్థలంలో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణం. ఆటలు ఆడుకోవడానికి, వ్యాయామం చేసుకోవడానికి దీనిని ఏర్పాటు చేసినప్పటికీ ఈ రెండు అక్కడ కనిపించవు. నిరుపయోగంగా ఉండడాన్ని చూసి అందులో ఆటోలు, ఇతర వాహనాలను నిలుపుతున్నారు. పార్కింగ్‌కు అనుకూలంగా ఉండడంతో క్రీడా ప్రాంగణం కాస్తా పార్కింగ్‌లకు అడ్డాగా మారింది. ఇక్కడనే కాదు.. చాలా చోట్ల క్రీడా ప్రాంగణాల పరిస్థితి ఇలాగే ఉండడం గమనార్హం.'

- పార్కింగ్ స్థలాలుగా మారిన వైనం
- కొన్ని చోట్ల దూరంగా ఏర్పాటు
- ప్రజాధనం వృథా

మెట్‌పల్లి మున్సిపాలిటీలో 26 వార్డులు ఉన్నాయి. ప్రతి వార్డులో ఆటలు, వ్యాయామాల కోసం క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీని కోసం పట్టణ ప్రగతి నిధులను వెచ్చించాలని సూచించింది. దీంతో స్థానిక అధికారులు ప్రాంగణాలను ఏర్పాటు చేసినప్పటికీ అంతగా ప్రయోజనం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

రూ.30 లక్షలు.. 20 చోట్ల ఏర్పాటు

పట్టణంలో క్రీడా ప్రాంగణాల కోసం రూ.30 లక్షలను కేటాయించారు. ఇప్పటివరకు 20 వార్డుల్లో వీటిని ఏర్పాటు చేశారు. మిగతా ఆరు వార్డుల్లో స్థలాల ఎంపిక సమస్యగా మారింది. ఒక్కో క్రీడా ప్రాంగణంలో వాలీబాల్, ఖోఖో కోర్టులు, రెండు ఎక్సర్‌సైజ్ బార్‌లు, లాంగ్ జంప్ పరికరాలను అందుబాటులో ఉంచాలి. కానీ చాలా చోట్ల స్థలం అనుకూలంగా లేకపోవడంతో పూర్తి స్థాయిలో పరికరాలను ఏర్పాటు చేయలేదు. ఎక్కువ చోట్ల కేవలం రెండు ఎక్సర్‌సైజ్ బార్‌లతోనే సరిపెట్టారు.


క్రీడా ప్రాంగణంలో ఉన్న పరికరాలు

వినియోగించని వైనం...

ప్రజల కోసం క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసినప్పటికీ చాలా చోట్ల ప్రజలు వాటిని వినియోగించడం లేదు. కొన్ని చోట్ల ప్రాంగణాలు కాలనీలకు దూరంగా ఉండడం, పిచ్చి మొక్కలతో నిండిపోవడం, లైట్లు లేకపోవడం వంటి కారణాలతో ప్రజలు వాటి వద్దకు వెళ్లడం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. సరైన వసతులను ఏర్పాటు చేస్తే స్థానిక ప్రజలు క్రీడా ప్రాంగణాలను వినియోగించుకునే అవకాశముంటుందని,అధికారులు స్పందించి ఆ దిశగా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ప్రయోజనం లేదు



పట్టణంలో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలతో పెద్దగా ప్రయోజనం లేదు. చాలా చోట్ల నిరుపయోగంగా ఉన్నాయి. రెండు, మూడు పరికరాలు మాత్రమే ఉండడంతో ప్రజలు ఉపయోగించడం లేదు. సరైన వసతులను కల్పించడంతో పాటు మరిన్ని పరికరాలను అందుబాటులో ఉంచాలి.

– పసునూరి శ్రీనివాస్, న్యాయవాది,మెట్‌పల్లి

ప్రజలు వినియోగించుకోవాలి



ఆరు వార్డుల్లో తప్ప మిగిలిన అన్ని వార్డుల్లో క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేశాం. మిగతా వాటిలో స్థలాలను ఎంపిక చేయాల్సి ఉంది. వార్డుల్లో ప్రజలకు ఉపయోగపడేలా వీటిని ఏర్పాటు చేశాం. వాటిల్లో ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకవస్తే పరిష్కరిస్తాం.

– అరుణ్‌కుమార్, మున్సిపల్ ఇంజినీర్, మెట్‌పల్లి

క్లుప్తంగా

విద్యార్థులు కరాటే నేర్చుకోవాలి


కరాటే శిక్షణ పొందుతున్న విద్యార్థులు

ఇబ్రహీంపట్నం: విద్యార్థులు ఆత్మరక్షణ కోసం కరాటే విద్యను నేర్చుకోవాలని హెచ్‌ఎం రాజేందర్ కోరారు. మండలంలోని వర్షకొండ జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు ఉచిత కరాటే శిక్షణను ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు 3 నెలల పాటు ఉచితంగా కరాటే మాస్టర్‌తో శిక్షణ ఇస్తుందని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ బాలరాజు, ఉపాధ్యాయుడు గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాల కల్పనకు చర్యలు


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో

రాయికల్: నవంబర్ 30న జరిగే అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీడీవో, మున్సిపల్ కమిషనర్ సంతోష్‌కుమార్ తెలిపారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ప్రతి పోలింగ్ కేంద్రాల్లో ఫ్యాన్, లైటింగ్, తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమావేశంలో సూపరింటెండెంట్ వేణు, మేనేజర్ వెంకట్ పాల్గొన్నారు.

కాలుష్య నివారణకు పాటుపడాలి


పోస్టర్లు ప్రదర్శిస్తున్న మున్సిపల్ సిబ్బంది

మెట్‌పల్లి: దీపావళి రోజున కాలుష్య నివారణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ రత్నాకర్ సూచించారు. పట్టణంలో పలు చోట్ల శుక్రవారం కాలుష్య వ్యాప్తి వల్ల కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ముఖ్యంగా పటాకల్లో విష పదార్థాలు ఉంటాయని, వాటిని కాల్చడంతో వ్యాపించే పొగను పీల్చడం వల్ల అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశముందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని వాటికి దూరంగా ఉండాలని కోరారు. అలాగే ప్లాస్టిక్ ప్రమీదలను వినియోగించవద్దన్నారు. కార్యక్రమంలో ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ విష్ణు, సిబ్బంది ముజీబ్, నిజాం తదితరులున్నారు.

బ్యాంకులకు ఖాతాదారులే కీలకం


బ్యాంకులో కేక్ కట్ చేస్తున్న మేనేజర్, సిబ్బంది

ఇబ్రహీంపట్నం:బ్యాంకులకు ఖాతా దారులే కీలకమని యూనియన్ బ్యాంక్ మేనేజర్ దిలీప్ పట్టిదార్ అన్నారు. మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంక్‌లో శుక్రవారం బ్యాంకు 105 వ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి ఖాతాదారులకు స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బ్యాంక్ సిబ్బంది నవీన్, రాకేశ్, ఫణిరాజ్, శ్రావణ్‌కుమార్,శివరాజ్‌మెహతా, ముత్యం, వంశీ, ఖాతాదారులు పాల్గొన్నారు.

కొండగట్టు: కొడిమ్యాల మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంక్‌లో 105వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో మేనేజర్ సంజీవ్‌కుమార్, అసిస్టెంట్ మేనేజర్ రాజ్‌కుమార్, బ్యాంక్ సిబ్బంది, ఖాతాదారుల పాల్గొన్నారు.

నూతన నియామకం

గొల్లపల్లి: టీ–టీడీపీ గొల్లపల్లి మండల అధ్యక్షుడిగా చిల్వాకోడూర్‌కు చెందిన సింగారం కొమురయ్యయాదవ్, మండల తెలుగు రైతు అధ్యక్షుడిగా శ్రీరాములపల్లికి చెందిన గుండేటి గంగారెడ్డిని నియమించినట్లు పార్టీ బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓరుగంటి భార్గవ్ తెలిపారు. తన మీద నమ్మకం ఉంచి మండల శాఖ అధ్యక్షుడిగా నియమించడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని కొమురయ్య యాదవ్, గంగారెడ్డి పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

జగిత్యాలజోన్: జిల్లా కేంద్రంలోని జగిత్యాల టౌన్–1 సెక్షన్, టౌన్–2 సెక్షన్, టౌన్–3 సెక్షన్ పరిధిలోని కాలనీల్లో శనివారం ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ అధికారులు సంతోష్‌కుమార్, కె.అశోక్, ఎండీ.రహీం తెలిపారు.

ఇబ్రహీంపట్నం: మండలంలోని యామాపూర్ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో శనివారంఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరాఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ సతీష్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.

కోరుట్ల: పట్టణంలో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో టౌన్ ఏఈ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

మల్యాల: మండలంలోని తాటిపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో శనివారం మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని ఇన్‌చార్జి ఏఈఈ వి.శ్రీనివాస్ తెలిపారు.

నేడు అయ్యప్ప ఆలయంలో చండీహవనం

కోరుట్ల రూరల్: పట్టణంలోని అయ్యప్ప గుట్టపై గల శ్రీ అయ్యప్ప, జ్ఞాన సరస్వతీ సహిత శ్రీ శనైశ్వరస్వామి ఆలయంలో శనివారం చండీ హవనం నిర్వహిస్తామని ఆలయ వ్యవస్థాపక గౌరవ అధ్యక్షుడు చిదురాల నారాయణ, అధ్యక్షుడు అంబటి శ్రీనివాస్ శుక్రవారం తెలిపారు. ఉదయం నుంచి ఆలయ ప్రధాన అర్చకులు పాలెపు జయరాం శర్మ ఆధ్వర్యంలో శనీశ్వరునికి సామూహిక తైలాభిశేకం నిర్వహిస్తారని పేర్కొన్నారు. భక్తులు సాంప్రదాయ దుస్తుల్లో రావాలని కోరారు.

ప్రలోభాలకు లొంగకుండా స్వచ్ఛందంగా ఓటేయాలి

ఇబ్రహీంపట్నం: ఓటర్లు ప్రలోభాలకు లొంగకుండా నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని ఏపీఎం శంకర్ అన్నారు. శుక్రవారం మండలంలోని గొధూర్‌లో స్వీప్ ఆధ్వర్యంలో ఓటర్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించి ప్రధాన కూడలి వద్ద మానవహారంగా ఏర్పడి ఓటు హక్కుపై ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భం సీ విజిల్ యాప్ డౌన్‌లోడ్ గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏపీఎం శంకర్,పంచాయతీ కార్యదర్శి రాజన్న, సీసీలు, వీవోఏలు, మహిళా సంఘ సభ్యులు పాల్గొన్నారు.


ప్రతిజ్ఞ చేస్తున్న మహిళా సంఘం సభ్యులు



ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు జన్మదిన వేడుకలు

మెట్‌పల్లి: పట్టణంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో శుక్రవారం ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ కార్యకర్తల సమక్షంలో ఎమ్మెల్యే కేక్ కట్ చేశారు. అనంతరం ఆయనకు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ దావ వసంత, మున్సిపల్ చైర్ పర్సన్ రాణవేని సుజాతలతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

బయట ఫుల్..లోపల నిల్

- నిరుపయోగంగా మున్సిపల్ మార్కెట్
- రోడ్డుపై కూరగాయల విక్రయాలతో స్థానికుల ఇబ్బందులు


మార్కెట్ ముందు విక్రయాలతో రోడ్డుపై రద్దీ


మున్సిపల్ మార్కెట్లో ఖాళీగా షెడ్లు

జగిత్యాలటౌన్: లక్షలాది నిధులు వెచ్చించి నిర్మించిన మున్సిపల్ మార్కెట్ విక్రయాలు లేక వెలవెలబోతోంది. రైతులు, అమ్మకం దారులు రోడ్డుపైనే విక్రయాలు చేస్తుండడంతో మార్కెట్ ఖాళీగా దర్శనిమిస్తోంది. జగిత్యాల పట్టణం విద్యానగర్‌లోని మున్సిపల్ మార్కెట్లో షెడ్లలో కూరగాయలు విక్రయించాల్సిన రైతులు, అమ్మకం దారులు మార్కెట్ ముందు రోడ్డుపై విక్రయిస్తుండటంతో లోపల నిల్ బయట ఫుల్ అన్న పరిస్థితి నెలకొంది. దీంతో కూరగాయలపై దుమ్ము,ధూళి చేరడంతో పాటు రోడ్డుపై విక్రయాలతో విద్యానగర్ నుంచి ధామా టాకీస్ వైపు వెళ్లే వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. రోడ్డుపై ట్రాఫిక్ ఎక్కువవుతోంది. బల్దియా అధికారుల నియంత్రణ కొరవడంతో లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన మున్సిపల్ మార్కెట్ వృథాగా మారుతోంది. రోడ్డుపై విక్రయాలతో అపరిశుభ్రంగా మారిన కూరగాయలు తిని ప్రజలు రోగాల బారిన పడుతున్న దుస్థితి నెలకొంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి విక్రయాలు మార్కెట్ లోపలే జరిపి ట్రాఫిక్ ఇబ్బందులు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

చిత్ర కథ: వీళ్లు నాటుడు.. వాళ్లు నరుకుడు..!



పెగడపల్లి: అధికారుల అనాలోచిత నిర్ణయాలతో హరితహారంలో నాటిన మొక్కలు నిరుపయోగంగా మారుతున్నాయి. మొక్కలు నాటి వాటిని సంరక్షించేందుకు వేలాది రూపాయలు ఖర్చు పెడుతున్నారు. తీరా అవి పెరిగి పెద్దయ్యే సరికి కొమ్మలు విద్యుత్ తీగలకు తాకుతున్నాయి. దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కల్గిస్తున్నాయనే కారణంతో విద్యుత్ సిబ్బంది వాటిని నరికివేస్తున్నారు. పెగడపల్లి నుంచి నందగిరి వెళ్లే ఆర్ అండ్‌బీ రహదారి పక్కన నాటిన మొక్కలను నరికి వేయడంతో ప్రజల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మొక్కలు నాటే సమయంలో విద్యుత్ తీగలు ఉన్నాయని అధికారులు గుర్తించక పోవడం శోచనీయమంటున్నారు.

వ్యవసాయ కళాశాలలో ముందస్తు దీపావళి వేడుకలు


వ్యవసాయ కళాశాలలో దీపావళి సంబరాలు

జగిత్యాలఅగ్రికల్చర్: జగిత్యాల రూరల్ మండలం పొలాస వ్యవసాయ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం ముందస్తు దీపావళి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు రంగురంగుల పూలతో విద్యుత్ దీపాలు వెలిగించి సంతోషంగా పండగను జరుపుకున్నారు. కార్యక్రమంలో అసోసియేట్ డీన్ డాక్టర్ భారతి నారాయణభట్, అసిస్టెంట్ ప్రొఫెసర్ రత్నాకర్ పాల్గొన్నారు.

పాఠశాలలో స్వచ్ఛ దివాళి, శుభ దివాళి



కల్లూర్ పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థుల ప్రతిజ్ఞ

కోరుట్ల: పట్టణంలోని కల్లూర్ రోడ్‌లోని బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం మున్సిపల్ ఆధ్వర్యంలో స్వచ్ఛ దివాళి, శుభ దివాళి కార్యక్రమం నిర్వహించారు. ప్రకృతికి హాని కలిగించకుండా మట్టి దివ్వెలనే దీపావళి రోజు వెలిగించాలని సూచించారు. విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయండి

- అదనపు కలెక్టర్‌కు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి లేఖ

సారంగాపూర్: మండలంలోని నాగునూర్‌లో సారంగాపూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అదనపు కలెక్టర్ (రెవెన్యూ)కు శుక్రవారం లేఖ రాశారు. నాగునూర్‌లో ఇప్పటి వరకు ఐకేపీ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రం నిర్వహిస్తుండేవారని, మహిళలు కొనుగోలు కేంద్రం నిర్వహణకు సుముఖంగా లేకపోవడంతో కొనుగోలు కేంద్రాన్ని రద్దు చేసారని, ఐకేపీ స్థానంలో సారంగాపూర్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించడానికి అనుమతించాలని లేఖలో కోరారు. కొనుగోలు కేంద్రం లేకపోతే రైతులు తీవ్ర ఇబ్బందులు పడే అవకాశం ఉందని పేర్కొన్నారు.

ఆర్థిక ప్రగతికి చేయూత


బ్యాంక్‌ను ప్రారంభిస్తున్న సీఈవో

జగిత్యాల: జగిత్యాల గాయత్రి బ్యాంక్ ఆధ్వర్యంలో వరంగల్‌లో మరో బ్రాంచ్‌ను సీఈవో వనమాల శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాయత్రిబ్యాంక్ అభివృద్ధి పథంలో ముందుకు సాగుతూ వినియోగదారులకు చేయూత నందిస్తుందన్నారు. ఇప్పటికే 28 శాఖలను ప్రారంభించినట్లు తెలిపారు. కార్పొరేట్ బ్యాంకులకు దీటుగా 1370.38 కోట్ల డిపాజిట్లతో 982.34 కోట్ల రుణాలను కలిగి అభివృద్ధి దిశలో ఉందన్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు ముత్యాల లక్ష్మారెడ్డి, సీఈవో వనమాల శ్రీనివాస్, రాజశేఖర్, సౌజన్య, రాజిరెడ్డి, సత్యం పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సాంస్కృతిక పోటీలకు జగిత్యాల విద్యార్థి

జగిత్యాలజోన్: రాష్ట్రస్థాయి సాంస్కృతిక పోటీలకు జిల్లా కేంద్రానికి చెందిన విద్యార్థి భూసారపు సిద్విక్ గౌడ్ ఎంపికయ్యారు. సమగ్ర శిక్ష అభియాన్ ఆధ్వర్యంలో ప్రతీ ఏడాది నిర్వహించే సాంస్కృతిక పోటీల్లో భాగంగా ఇన్‌స్ట్రుమెంటల్ విభాగంలో కీబోర్డు (పియానో) వాయిద్యానికి సిద్విక్‌గౌడ్ ఎంపికయ్యారు. విద్యార్థి ఎంపికపై శ్రీనిధి పాఠశాల ప్రిన్సిపాల్ రాజేందర్, జిల్లా సాంస్కృతిక ప్రతినిధులు గుండేటి రాజు, ఏవీఎస్ రాజు, నాగరాజు, ఎస్వీ రమణ తదితరులు అభినందించారు.

క్రీడాకారుల ప్రతిభ

జగిత్యాల: ఈనెల 4,5 తేదీల్లో జరిగిన 5వ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ బాస్కెట్‌బాల్ టోర్నమెంట్‌లో చైతన్య టెక్నో స్కూల్‌కు చెందిన విద్యార్థులు శ్రీనైన, అక్షర అత్యంత ప్రతిభ కనబర్చి జగిత్యాల జిల్లాను మూడోస్థానంలో నిలబెట్టారు. ఈ సందర్భంగా చైతన్య టెక్నో పాఠశాల ప్రిన్సిపాల్ సచిన్, డీన్ మురళీకృష్ణ, వంశీకృష్ణ, అజయ్ తదితరులు వారిని అభినందించారు.

మోటార్లలో కాపర్ వైర్ చోరీ

కథలాపూర్: కథలాపూర్ శివారులోని వరదకాల్వకు రైతులు ఏర్పాటు చేసుకున్న మోటార్ల కాపర్ వైర్లు దొంగలు ఎత్తుకెళ్లినట్లు గ్రామస్తులు తెలిపారు. కథలాపూర్ కు చెందిన సుమారు 30 మంది రైతులకు చెందిన మోటార్ల కాపర్ వైర్లను దొంగలు కత్తిరించి తీసుకెళ్లారు.ఇదే ప్రాంతంలో వారం రోజుల క్రితం పదిమంది రైతుల మోటార్ల కాపర్ వైర్లను ఎత్తుకెళ్లారని తెలిపారు. దొంగలు వరుసగా మోటార్ల వైర్లను ఎత్తుకెళ్లడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఎమ్మెల్యే రవిశంకర్‌కు బాలుడి విరాళం


విరాళం అందజేస్తున్న పోచమ్మల సాత్విక్

మల్యాల: మండలంలోని రామన్నపేట గ్రామానికి చెందిన కొండగట్టు ఆలయ ధర్మకర్త పోచమ్మల ప్రవీణ్ కుమారుడు సాత్విక్ శుక్రవారం చొప్పదండి బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి సుంకె రవిశంకర్‌కు రూ.40 వేలు విరాళంగా అందజేశారు. శుక్రవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా రామన్నపేటకు వచ్చిన రవిశంకర్‌కు మీ వెంటే మేముంటామని, ఎన్నికల ఖర్చుల కోసం తమవంతు సాయం అందించినట్లు ప్రవీణ్ తెలిపారు.